మా మే స్త్రీత్వమ్

--నిడదవోలు మాలతి

ఆకునంటిపెట్టుకుని గూడు కట్టుకున్న గొంగళిపురుగులా భూదేవిని నమ్ముకుని పడుకున్న ఆ వూరి ప్రజల్లో చలనం కలిగించగలిగినవి చాలా తక్కువ. ఎలక్షన్ల వంటి ప్రాపంచిక విషయాలూ, బాలయోగులవంటి ఆముష్మికచింతనలకూ కూడా అతీతులు వాళ్ళు. కళ్ళెదుట ఖూనీ జరిగితే, ఓమారటు చూసి, చుట్ట వెలిగించుకు వెళ్ళిపోయే జాతి అది. అక్కడ అన్యాయం లేదు– ఎందుకంటే ఎవడూ ఎవణ్ణీ కొట్టడు కనక. అక్కడ న్యాయం లేదు– ఎందుకంటే ఎవడికైనా దెబ్బ తగిలితే రెండోవాడు కలుగజేసుకోడు కనక. స్వర్గమూ, నరకమూ రెండూ తెలీవు అక్కడివాళ్ళకి.

ఆ స్తబ్ధ జగతిలో కించిత్ చలనం కలిగించింది ఆమె రాక. ఆమె అక్కడికి ఎలా వచ్చిందో ఎందుకు వచ్చిందో ఎవరికీ తెలీదు. ఒకానొక సుప్రభాతాన ఊరు ఆవులించి కళ్ళు విప్పితే ఆమె కనిపించింది. అంతే.

''ఎవరు నువ్వు?'' అని ఎవరూ అడగలేదు. ఊరు చివర కూలిపోతున్న ఎండు దేవాలయంలో ఆమె ఎాతచీర పరుచుకుని పడుకుంటే ఎవరూ కాదనలేదు.

మర్నాడు ఆమె స్నిగ్ధత్వం విరిసే కనులతో, చిరునవ్వులొలికే వదనంతో వీధిలోకి వచ్చింది. ఆ వీధుల్లో ఎవరూ కొంపలంటుకు పోతున్నట్టు పరుగులు పెట్టడం లేదు. పనిగట్టుకుని 144 సెక్షను వ్యతిరేకిస్తున్నట్టు రోడ్డుకడ్డంగా సైకిళ్ళు పట్టుకు నిలబడి అప్రస్తుతాలు చర్చించే గుంపులు లేవు. ఆమె ముందుకిసాగి పోతూనే ఉంది.

ఒక చోట ఆగింది. అక్కడ ఒక లేగదూడ కాలువలో పడి లేవలేక అవస్థ పడుతోంది. ఆమె చుట్టూ చూసింది. ఎవరూ లేగదూడని గమనించినట్టు లేదు. తనే వెళ్ళి మెల్లిగా దాన్ని లేవదీసింది. అతికష్టం మీద దాన్ని ఇంటికి చేర్చింది.

దారిలో ఒకరిద్దరు ఆమెవేపు వింతగా చూశారు.

''నీకెందుకు ఈ బాధంతా?''

ఆమె వనంగా సాగిపోయింది. ఇంటికి తీసుకెళ్ళి దెబ్బలకి ఆకుపసరు రాసింది. రెండు రోజులు పట్టింది దూడ లేచి తిరగడానికి. మూడో రోజు దాని యజమాని వచ్చి దూడని తోలుకుపోయాడు. వెళ్తూ, వెళ్తూ, తన విశాలమైన కళ్ళతో ఓ మారు ఆమె వేపు చూసి వెళ్ళిపోయింది ఆ లేగదూడ.

మరొకరోజు, చాలా రోజులతరవాత, అలా వెళ్తుంటే ఒక పదేళ్ళ కుర్రాడు ఏడుస్తూ కనిపించాడు.

''ఎందుకేడుస్తున్నావు?'' అని అడిగింది ఆవిడ.

''నీకెందుకూ?'' అన్నాడు ఆ కుర్రాడు.

''అవును. నీకెందుకూ?'' అంది ఆ కుర్రాడి పక్కనే ఉన్న తల్లి.

''ఊరికే అడిగాను,'' అంది ఆమె మందహాసంతో. ఆ కుర్రాడు, తల్లి– ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

''మా యింటికి వస్తావా?'' అంది ఆమె.

''సరే'' నని ఆ బాలుడు ఆమెననుసరించాడు. ఇది కొత్త విషయమే. అయినా అందరికీ సహజంగానే తోచింది. ఆ కుర్రాడు వరసగా వారం రోజులు ఆమె ఇంటికి వెళ్ళాడు.

ఒక రోజు అడిగాడు, ''ఎందుకు నన్ను ఇలా రమ్మంటున్నావు?'' అని.

''నాకు నీలాంటి కొడుకు ఉండేవాడు. నిన్ను చూస్తే వాడిని చూసినట్టు ఉంటుంది'' అని ఆమె సమాధానం చెప్పింది.

''ఓహో'' అన్నాడు కుర్రాడు సరిగ్గా అర్థం కాకపోయినా.

ఊళ్ళో అందరూ కొత్తమ్మ కోరుకున్న కొడుకు అని అతన్ని హేళన చేశారు.

వాడికి రోషం వచ్చింది. ఆమె ఇంటికి వెళ్ళడం మానేశాడు. ఆరాత్రి ఆమె కన్నీటితో కనిపించింది. ''మాయింటికి ఎందుకు రాలేదు?'' అని అడిగినట్టు అనిపించింది. నిద్ర లేవగానే పరుగెత్తుకుంటూ అక్కడికి వెళ్ళాడు. ఆమె చెంపన చేయి చేర్చి, దిగంతాలలోకి చూపులు నిగిడ్చి చూస్తూ కూర్చుని ఉంది.

''నేనొచ్చానమ్మా!'' అన్నాడు ఉవ్వెత్తుగా పొంగుతున్న గుండెలను కంఠస్వరంలో విశదం చేస్తూ.

ఆమె అతడి వేపు తిరిగింది. ''ఫో. ఫో. ఎందుకొచ్చావ్. ఇక్కడేం దాచిపెట్టావా రోజూ రావడానికి? నేనేమేనా నీకు అచ్చున్నానా నీకు చేసి పెట్టాడానికి. ... వేలు చూపితే మండ ఖింగే రకాలు. ఛీ, ఛీ. ఇంకెప్పుడూ ఈ చాయలకు రాకు.''

ఆ అబ్బాయికి అంతా అయోమయంగా ఉంది. ఆమె మాటలు ఏమీ అర్థం కాలేదు. ''ఫో'' అన్న ఒక్క మాటే తెలిసింది. వాడు గిరుక్కున తిరిగి వెళ్ళి పోయాడు. దారిలో ఒక చెట్టుకింద కూచుని ఏడిచాడు కొంచెంసేపు.

తలెత్తి చూస్తే ఆమె రెండు పూతరేకులు పట్టుకుని నించుని ఉంది. ''ఇంద'' అంది.

''నాకేం అఖ్ఖర్లేదు'' అంటూ లేచి పరుగెత్తుకు వెళ్ళిపోయాడు.

''పోతే ఫో. బ్రతిమాలితే గీరెక్కువవుతుంది. పుణ్యానికి పుట్టెడు బియ్యం ఇస్తే పిచ్చ కుంచంతో కొలిచావని పోట్లాడిందిట. నేనేమీ ఎవరికీ రుణపడి లేను.'' అంటూ ఆమె గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

క్రమంగా ఆమెని గూర్చి ప్రజలు గుంపులు గుంపులుగా చేరి చెప్పుకోసాగారు. ''ఎవరెలా పోతే మనకి ఎందుకు అన్న భావం మంచులా విడిపోతోంది. ప్రతివాళ్ళూ మాటసాయం కావాలనో పనిసాయం కావాలనో ఆమె దగ్గిరికి వస్తున్నారు. ఒక మంచిపని చేసి ''కొత్తమ్మ''తో గొప్పగా చెప్పుకునేవాళ్ళు అనేకం ఉన్నారు. ఒకప్పుడు ఆమె హర్షం వెలిబుచ్చుతుంది. ఒక్కొక్కప్పుడు ''అదీ గొప్పేనా?'' అని తేల్చిపారేస్తుంది. మరోసారి ''అలా కాదు, ఇలా చెయ్యాలి'' అని చెబుతుంది. లేదా తనే చేసి చూపిస్తుంది. ఒకమారు పాలమనిషి ఆవు కొమ్ము విసిరి మంచం పట్టిందని వాళ్ళింట్లో వారం రోజులుండి సేవ చేసిందిట. మరో రోజు నారపరాజుగారి చిన్నకోడలు ''కాస్త నలతగా ఉంది. చూసి పో'' అని కబురు చేస్తే, ''ఏం కావరం ఇంటికి రమ్మని కబురు చేయడానికి. ఫో. ఫో. రానని చెప్పు'' అని కసిరి కొట్టిందిట. అయినా ఆమె అంటే అందరికీ ఎనలేని ఆపేక్షా, భయమూను. ఒకమారు కాకపోతే ఒకమారైనా ఎకువగా చనువు చూపగలిగింది అబ్బాయి ఒక్కడే. వాడికి ఆమె కసుర్లూ, విసుర్లూ, ఆగ్రహమూ, అనుగ్రమూ అన్నీ ఒకటే. ఒక్కొక్కమారు వాడికి రోషం వస్తుంది. కోపం వస్తుంది. అవన్నీ వాడు అమె దగ్గిర్నుంచే నేర్చుకున్నాడు.

అలాగ రోజులూ, వారాలు, నెలలుగా నాలుగు సంవత్సరాలు జారిపోయాయి. అబ్బాయి కొంచెం పెద్దవాడయాడు. ఆమెలో కొంచెం వార్ధక్యపు ఛాయలు కనిపిస్తున్నాయి. ఊళ్ళో ఉత్తేజం కనిపిస్తోంది.

ఆరోజు పోలేరమావాస్య. పోలి స్వర్గానికి వెళ్ళిన పర్వ దినం. అబ్బాయి అప్పటికి నాలుగు రోజులుగా అమ్మ దగ్గిరికి వెళ్ళలేదు అలిగి. అదే మరొక సందర్భంలో ఐతే అమె స్వయంగా వచ్చి పిలుచుకు వెళ్ళేది. కాని ఈమారు అలా రాలేదు. అబ్బాయికి ఓర్పు నశించింది. ఏ విషయం ముఖాముఖీ తేల్చుకోవాలనుకున్నాడు. విసురుగా లేచి, నిముషాలమీద ఆమె జీర్ణ కుటీరం

చేరుకున్నాడు. అక్కడ ఆమె ఒంటరిగా లేదు. ఒక బాలుడిని అక్కున చేర్చుకుని లాలిస్తోంది. నెన్నుదురు మృదువుగా చుంబిస్తోంది. వాడి చెంపలు నిమురుతోంది.

ఒక మధ్య వయస్కుడు ఇదంతా యిష్టం లేనట్టు గవాక్షం దగ్గిర నిల్చుని సుదూరాల్లోకి చూస్తున్నాడు. ఆగి ఆగి తూచినట్టు ఒకొక్క మాటే పలుకుతున్నాడు. ''జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు వచ్చేయమ్మా అంటే నీకు ఎందుకింత పట్టుదల? నిన్నేమైనా నేనక్కడ రాళ్ళు మొయ్యమన్నానా? అదీ నాకోసం అయితే నేనింతగా పాకులాడనే ఆడను. ... ఆ పసివాడికోసం. .. ఇంతకీ నీకు ... మా కంటే.. ఈ పసివాడికంటే ... వీళ్ళు ఎక్కువయిపోయారు...'' చివరిమాటలు అంటుంటే అతడి కంఠం గద్గదమయింది.

''చాల్లేవోయ్. మాటలు నేర్చావు,'' అని కసిరింది ఆమె. కాని ఆ స్వరంలో కాఠిన్యం కంటె మార్దవమే హెచ్చు. గెలుపెవరిదో తెలిసిపోయింది. ...

అబ్బాయి గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఝంఝు మారుతంలా ఊరివేపు సాగి, దారిలో చెట్టుకింద ఆగాడు. అతని కన్నులలో ఎరుపుజీర మెరుస్తూంది. హృదయం తీవ్రంగా కొట్టుకుంటూంది. ''సరే .. సరే..'' అనుకుంటూ కదలిపోయాడు. దారిలో అడిగిన వాళ్ళకీ, అడగనివాళ్ళకీ వివరించి చెప్పాడు. కనిపించనివాళ్ళకి కబురు చేశాడు. కొందరు అతన్ని ఓదార్చారు. కొందరు అతన్నే చీవాట్లు వేశారు. మరి కొందరు ఉచిత సలహాలు ఇచ్చారు.

అబ్బాయికి తోచడంలేదు.

ఏదో అన్యాయం జరుగుతోంది.

ఏవిటో స్పష్టంగా చెప్పలేక పోతున్నాడు.

మాటలు దొరకడం లేదు.

తమస్సు కమ్ముకు వస్తోంది.

లోకం నిద్ర కొరిగింది.

... ...

''అమ్మా!'' --చీకట్లు చీల్చుకు ఒక పసివాడి ఆక్రందన దిక్కుల పిక్కటిల్లింది.

జరిగింది తనకి తెలీదంటూ కర్మసాక్షి అప్పుడే ఉదయించాడు.

ఆమె గది మధ్య నిలబడి ఉంది నిశ్చలంగా. మంచంమీద పసివాడు నీరసంగా పడి ఉన్నాడు.

వాడిని తీసుకు వచ్చిన మధ్య వయస్కుడు దూరంగా గోడనానుకుని నిల్చుని ఉన్నాడు.

గోడఅవతల పశ్చాత్తాపంతో దహించుకు పోతున్నాడు.

ముగ్గురు మూర్ఖులు ఆమె పాదాలు పట్టుకు వదలడం లేదు.

''నువ్వు క్షమించాను అన్నదాకా మేం వదలం. క్షణికమైన ఆవేశాలకు లొంగిపోయాం. .. మావంటి పాపాత్ములు లోకంలో మరి ఉండరు. మా పాపానికి ప్రాయశ్చిత్తం ఉండదు. చెప్పు తల్లీ, ఏ శిక్ష అయినా అనుభవిస్తాం. నీ కోపాగ్ని మాత్రం భరించలేం. .. చెప్పు... క్షమించు...''

ఆమె వాళ్ళవేపు చూసింది. వీరిని ఈ స్థితికి తెచ్చిందెవరు?

మంచంమీద పసివాడివేపు చూసింది. ''నాకెందుకు ఈ శిక్ష'' అని ప్రశ్నిస్తుట్టు అనిపించింది ఆమెకి.

కనురెప్పలు బరువుగా కదిల్చి కుడివేపు గోడవారకి దృష్టి మళ్ళించింది. ''ఇప్పుడేం చేయగలవు'' అని నిందిస్తున్నాడు అతను వనంగానే.

ఆమె కనులు మూసుకుంది. మనోఫలకం పైన అబ్బాయి చిత్తరువు అస్పష్టంగా కదిలింది. ఆమె పెదవులు కదిలాయి.

భగవాన్!

మా మే స్మృత్వమ్

మా మూర్ఖత్వమ్

మిధ్యా దృష్టిర్మా ...

జాతౌ జాతౌ...

మా స్మృత్వమ్ ... మా మే స్మృత్వమ్...

ఇతి

(కృష్ణవేణి, అక్టోబరు 1966, లో ప్రచురితం.)